సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 3 । జూలై । 2023

అదిరేట్టు.. ఐదారు రెట్లు!

రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు అధిక పెన్షన్ స్కీమ్‌ను అమలు చేస్తోంది. దీంతో ఇప్పటివరకు అందే పెన్షన్ కన్నా ఐదారు రెట్లు పెరిగే అవకాశం ఉంది. - 8లో▸



సాంకేతిక విద్యకు దిక్సూచి జేఎన్‌టీయూకే

సాంకేతిక విద్యకు దిక్సూచిగా జేఎన్‌టీయూకే నిలుస్తుందని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం 43.5° / 28.4°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	43.5	28.5
కాకినాడ	39.2	29.0
అమలాపురం	41.0	28.4

న్యూస్‌రీల్

కిక్కిరిసిన విఘ్నేశ్వరుని ఆలయం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొల్పు సేవ నిర్వహించారు. అనంతరం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాల్లోను, లక్ష్మీగణపతి హోమంలోను అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి గరిక పూజ జరిపారు. పంచామృత అభిషేకం, ప్రత్యేక అభిషేకాల్లో 20 మంది భక్తదంపతులు, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 224 మంది భక్తులు, శ్రీ లక్ష్మీ గణపతి హోమంలో 19 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. ఆరుగురు చిన్నారులకు నామకరణం, అక్షరాభ్యాసం, అన్నప్రాసన, తులాభారం నిర్వహించారు. 15 మంది తమ నూతన వాహన పూజ నిర్వహించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.92,801 లభించిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

హాస్టళ్లలో ఎమ్మెల్సీ తనిఖీలు



వడ్డిగూడెం బాలికల హాస్టల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, కిరణ్

అమలాపురం టౌన్: హాస్టళ్ల ప్రగతి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తున్న క్రమంలో మౌలిక సదుపాయాలు పక్కాగా ఉండాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. అమలాపురంలోని కొంకాపల్లి బాలుర, వడ్డిగూడెంలోని బాలికల హాస్టళ్లలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్‌తో కలిసి ఆదివారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీలు చేశారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులతో మాట్లాడారు. హాస్టళ్ల సిబ్బందికి పలు సూచనలు చేశారు. హాస్టళ్లలో అప్పటికే మధ్యాహ్న భోజనానికి సిద్ధమైన వంట పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే వడ్డిగూడెం హాస్టల్‌లో విద్యార్థినులు తమకు తాగునీటి వసతి సక్రమంగా లేదని చెప్పారు. దీనిపై స్పందించిన వారు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకుడు యనమదల కరుణాకర్ తదితరులు ఎమ్మెల్సీ వెంట ఉన్నారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి ఆదివారం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ ఆలయానికి భక్తులు వస్తూనే ఉన్నారు. దీంతో సత్యదేవుని దర్శనం క్యూలైన్లు, ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంత మండపాలు భక్తులతో నిండిపోయాయి. సుమారు 40 వేల మంది స్వామి వారిని దర్శించి, పూజలు చేశారు. వ్రతాలు 3 వేలు జరిగాయి. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రదక్షిణ దర్శనానికి గంట సమయం పట్టింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో ఐదు వేల మందికి భోజనం పెట్టారు.

పక్కాగా డ్వాక్రమాలు

- కోనసీమ జిల్లాలో పలు మండలాల్లో స్త్రీ నిధి పక్కదారి
- మోసం జరిగే కన్నా ముందుగానే మేల్కొందాం అంటున్న డీఆర్‌డీఏ
- ఎస్‌హెచ్‌జీ సభ్యులను అప్రమత్తం చేస్తున్న జిల్లా అధికారులు



తమకు జరిగిన మోసాన్ని డీఆర్‌డీఏ పీడీ శివశంకర్‌ప్రసాద్‌కు వివరిస్తున్న పేరూరు ఎస్‌హెచ్‌జీ సభ్యులు (ఫైల్)

సాక్షి, అమలాపురం: మొన్న ఆత్రేయపురం... నిన్న బండారులంక... నేడు పేరూరు. ఇలా వరుసగా మహిళా స్వయంశక్తి సంఘాల (ఎస్‌హెచ్‌జీ)కు చెందిన బ్యాంకు రుణాలు, స్త్రీ నిధి రుణాల గోల్‌మాల్ వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. పక్కాగా ఆడిట్ చేసి విచారణ నిర్వహిస్తే మరిన్ని మండలాల్లో ఇటువంటి స్కామ్‌లు బయటపడే అవకాశముంది. ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలనే తలంపుతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎస్‌హెచ్‌జీలకు ఇచ్చే రుణ పరిమితిని పెంచారు. బ్యాంకు రుణాలతోపాటు స్త్రీ నిధి రుణ పరిమితి పెంచారు. ఇదే అదనుగా కొంత మంది డీఆర్‌డీఏ యానిమేటర్లు, క్లస్టర్ కోఆర్డినేటర్లు కలిసి మహిళల సొమ్మును దోచుకుంటున్నారు. దీనిని గుర్తించిన డీఆర్‌డీఏ అధికారులు నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించారు.

పక్కదారి పడుతున్న డబ్బు

జిల్లాలో ఇటీవల మహిళా స్వయం శక్తి సంఘాల రుణాల వాయిదాల సొమ్ము, పొదుపు, స్త్రీ నిధి రుణాలను రూ.లక్షల్లో దోచేస్తున్నారు. గతంలో అంబాజీపేట మండలం మాచవరంలో ఒక యానిమేటర్ రూ.20 లక్షలకు పైగా చేతివాటం ప్రదర్శించింది. స్త్రీ నిధితోపాటు పొదుపు సొమ్ము, రుణాలకు చెందిన వాయిదాల సొమ్ము సొంత వ్యాపార అవసరాల కోసం వాడుకుంది. బాధితులు ఒత్తిడి చేయడంతో డీఆర్‌డీఏ అధికారులు కొంత వరకు వసూలు చేశారు. అయినా ఇంకా చాలామంది సొమ్ము పోగొట్టుకుని అప్పుల పాలయ్యారు. కనీసం ఆమె మీద కేసులు పెట్టి చర్యలు తీసుకోలేదు. అంతకు ముందు బండారులంకలో స్త్రీ నిధి సొమ్ము రూ.10.70 లక్షలు వాడేశారు. ఇదే మండలం పేరూరులో రూ.16.80 లక్షల స్త్రీ నిధి, పొదుపు సొమ్ముతో పాటు రూ.28.09 లక్షల బ్యాంకు రుణం సొమ్ము పక్కదారి పట్టించారు. ఆత్రేయపురం మండలం పేరవరం, బొబ్బర్లంక, రాజవరం, మెర్లపాలెంలో వెలుగు చూసిన అక్రమాల్లో సుమారు రూ.52 లక్షలు స్వాహా చేశారు. నష్టపోతున్నవారిలో చిరు వ్యాపారులు, కూలీ పనులు చేసుకునేవారు, నిరుపేదలు ఉండడం గమనార్హం. కొంతమంది రుణాలు తీసుకోకపోయినా, మరి కొంతమంది సకాలంలో వాయిదాలు చెల్లించినా సిబ్బంది చేతివాటం వల్ల బ్యాంకుల వద్ద డిఫాల్టర్లుగా మారిపోయారు.

అవగాహన కల్పించేందుకు చర్యలు



తప్పు జరిగిన తరువాత బాధ్యులపై చర్యలు తీసుకోవటం కన్నా, అసలు తప్పు జరగకుండా చూడాలని డీఆర్‌డీఏ భావిస్తోంది. గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలకు అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి నెలా జరిగే సమాఖ్య సమావేశాల్లో ఈ అంశంపై చర్చించనున్నారు. ఆర్థిక లావాదేవీలపై ఆరా తీయడంతోపాటు సంఘాలు సక్రమంగా వాయిదాలు చెల్లిస్తున్నదీ లేనిది, వీఓఏలు, సీసీలు వాటిని జమ చేస్తున్నదీ, లేనిది పరిశీలించనున్నాం. సొమ్ము చేతులకు ఇవ్వొద్దని, బ్యాంకు, సిబ్బందికి రుణాల వాయిదాలు, స్త్రీ నిధుల వాయిదాలు చెల్లిస్తే రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సంఘాలకు చెబుతున్నాం.

– డాక్టర్ వి.శివశంకర్ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ

సొమ్ము స్వాహా ఇలా..

- స్త్రీ నిధి రుణాలు మంజూరు చేసేందుకు సభ్యుల బయోమెట్రిక్ అథంటికేషన్ తప్పనిసరి. అయితే కొంతమంది గ్రామ సమైఖ్య సహాయకులు (వీఓఏ), క్లస్టర్ కో ఆర్డినేటర్ (సీసీ)లు సంఘ సభ్యులను పక్కదారి పట్టిస్తున్నారు. ఏదో ఒక కారణం చెప్పి వారి వద్ద నుంచి అక్రమ పద్ధతిలో బయోమెట్రిక్ అథంటికేషన్ తీసుకోవడం ద్వారా సదరు సభ్యుల పేరుపై స్త్రీ నిధి రుణం కోసం దరఖాస్తు చేస్తున్నారు.
- రుణ దరఖాస్తుపై సభ్యురాలు, ఎస్‌హెచ్‌జీ లీడర్లు, వీవో లీడర్ల సంతకాలు తీసుకున్న తరువాత సీసీ, ఏపీఎంలు సంతకాలు చేయాలి. కానీ ఇవేమీ లేకుండానే రుణాలు మంజూరు ప్రక్రియ పూర్తి చేస్తున్నారు.
- తన లాగిన్‌లో పీడీఎఫ్ ఫార్మాట్‌లో అందుబాటులో ఉన్న దరఖాస్తులపై ఉద్యోగుల సంతకాలు పూర్తిగా ఉన్న తరువాతనే స్త్రీ నిధి బ్యాంకు మేనేజర్ ధ్రువీకరించుకుని రుణాలు ఇవ్వాల్సి ఉంది. మేనేజర్‌లు వాటిని పట్టించుకోవడం లేదు. సిబ్బందితో సదరు స్త్రీ నిధి బ్యాంకు ఉద్యోగులు కుమ్మక్కై అవకతవకలకు పాల్పడుతున్నారు.
- అసలైన లబ్ధిదారుల ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ అకౌంట్‌కు బదులు నకిలీ లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్‌లలో ఏపీఎం లాగిన్‌ల నుంచి నమోదు చేస్తున్నారు. తద్వారా మంజూరైన రుణాలను దారి మళ్లిస్తున్నారు. రుణాలు మంజూరు అయిన తరువాత ఈ నిధులను డ్రా చేసుకొని దుర్వినియోగం చేస్తున్నారు. రుణం మంజూరు అయిన సంగతి అసలు లబ్ధిదారులకు తెలియకపోవడం ఇక్కడ గమనార్హం.
- కొన్నిచోట్ల ఒకరి పేరుతో రుణాల కోసం దరఖాస్తు చేయించి అదే గ్రూపులోని మరొకరికి ఆ రుణాలు బదలాయిస్తున్నారు. దీంతో రుణం పొందలేని వారు నష్టపోతున్నారు.
- గ్రామ సంఘం వద్ద ఉండాల్సిన రశీదు పుస్తకాలను కొంతమంది వీవోఏలు తమ వద్ద ఉంచుకుని సభ్యులు కట్టిన సొమ్ము దుర్వినియోగం చేస్తున్నారు.
- రుణం మంజూరైన తరువాత స్త్రీనిధి ఆన్‌లైన్ డిమాండ్ జనరేట్ కాకుండానే రుణ రికవరీ మొదలు పెడుతున్నారు. వసూలు అయిన సొమ్మును స్త్రీనిధి ఖాతాకు జమ చేయకుండా వీవోఏలు, సీసీలు పంచుకుంటున్నారు.

వాడపల్లి నిత్యాన్నదాన పథకానికి విరాళాలు



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తునికి చెందిన కనుమూరి వెంకటరాజు సుశీల దంపతులు రూ.51,116, రాజానగరం మండలం నరేంద్రపురానికి చెందిన పబ్బన బుల్లియ్యనాయుడు, కమలాదేవి దంపతులు రూ.51,116, మండపేటకు చెందిన బెళ్లపుకొండ వెంకట్రావు, అనసూయ దంపతులు రూ.50,049, భీమవరానికి చెందిన బి. సత్యనారాయణ, వెంకట నాగ లక్ష్మి దంపతులు రూ.20,116, బి.గణేష్‌వర్మ, మౌనిక దంపతులు రూ.10,116, కేశవరానికి చెందిన జి.నాగ వెంకట సుబ్రహ్మణ్యం, లలిత దంపతులు రూ.15,001, నెల్లూరు జిల్లా వేదయ్యపాలేనికి చెందిన పి.భరత్, భువన దంపతులు రూ.10,016 విరాళం అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతకు స్వామి వారి చిత్రపటం అందజేశారు.

నేడు యథావిధిగా స్పందన

అమలాపురం రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాలు సోమవారం యథావిధిగా జరుగుతాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయిలోను, ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయిలో, తహసీల్దార్ల కార్యాలయాల్లో గ్రామ, వార్డు సచివాలయాలలో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు. అధికారులు అందరూ సోమవారం ఉదయం 10 గంటల నుంచే ఫిర్యాదులను స్వీకరిస్తారని, గ్రామ/వార్డు సచివాలయాల్లో మాత్రం మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య విజ్ఞాపనలు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో ఎంఈవో-1లు వీరే

రాయవరం: మండల విద్యాశాఖాధికారి-1 ఖాళీ పోస్టులకు గ్రేడ్-2 హెచ్‌ఎంలు ఎంఈవోలుగా ఆప్షన్ ఇచ్చారు. ఎంఈవో-1 పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా కాకినాడ ఆర్‌జేడీ కార్యాలయంలో ఆదివారం ఆర్‌జేడీ జి.నాగమణి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా విధులు నిర్వర్తిస్తున్న హెచ్‌ఎంలు వారికి నచ్చిన స్థానాలకు ఎంఈవో-1గా ఆప్షన్ ఇచ్చారు.

మండలం	ఎంఈవో-1	ప్రస్తుతం పనిచేస్తున్న స్కూల్
అమలాపురం	జి.సూర్యప్రకాశం	జీహెచ్‌ఎస్, అమలాపురం
ఆలమూరు	పి.షాలెంరాజు	జీహెచ్‌ఎస్, మండపేట
అంబాజీపేట	కె.వెంకటేశ్వరరావు	జీహెచ్‌ఎస్, అనాతవరం
ఐ.పోలవరం	ఎస్.కొండారెడ్డి	జీహెచ్‌ఎస్, సామర్లకోట
కాట్రేనికోన	కేవీవీఎస్ సుబ్రహ్మణ్యం	జీహెచ్‌ఎస్, పెరవలి
మామిడికుదురు	ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ	జీహెచ్‌ఎస్, కోరుకొండ
రావులపాలెం	డి.క్రిష్టోఫర్ కొర్నిలియస్	జీహెచ్‌ఎస్, కొత్తపేట
రాయవరం	పి.రామలక్ష్మణమూర్తి	జీహెచ్‌ఎస్, ఆలమూరు
రాజోలు	ఎస్.మనోహరమ్	జీజీహెచ్‌ఎస్, నరసాపురం
సఖినేటిపల్లి	డి.కిషోర్‌కుమార్	జీహెచ్‌ఎస్, పల్లిపాలెం

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి ఆదివారం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ ఆలయానికి భక్తులు వస్తూనే ఉన్నారు. దీంతో సత్యదేవుని దర్శనం క్యూలైన్లు, ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంత మండపాలు భక్తులతో నిండిపోయాయి. సుమారు 40 వేల మంది స్వామి వారిని దర్శించి, పూజలు చేశారు. వ్రతాలు 3 వేలు జరిగాయి. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రదక్షిణ దర్శనానికి గంట సమయం పట్టింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో ఐదు వేల మందికి భోజనం పెట్టారు. రత్నగిరిపై ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో భక్తులు అల్లాడిపోయారు. నాలుగు రోజులుగా భానుడు ప్రతాపం చూపుతూండటంతో ఆలయ ప్రాంగణం, తూర్పు, పశ్చిమ రాజగోపురం మెట్లు వేడెక్కిపోతున్నాయి. మెట్లపై కార్పెట్ వేయకపోవడంతో కాళ్లు కాలి భక్తులు అవస్థలు పడ్డారు. ఆలయ ప్రాంగణం, తూర్పు, పశ్చిమ రాజగోపురాల దిగువన వేసిన చలువ పందిళ్ల వద్ద సేదదీరారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడటంతో భక్తులకు కాస్త ఉపశమనం కలిగింది.

గాజుల గలగలలు.. అమ్మవారి మెరుపులు



ప్రత్యేక అలంకరణలో శ్రీమహావిష్ణువు, శ్రీమహాలక్ష్మి అమ్మవారు

అన్నవరం: రంగురంగుల్లో తయారైన వేలాది గాజుల అలంకరణలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు మెరిసిపోయారు. ఆ తల్లిని దర్శించిన భక్తులు భక్తిపారవశ్యంలో ఓలలాడారు. రత్నగిరి దర్బారు మండపంలో సత్యదేవుని ఉత్సవమూర్తుల చెంత కొలువు తీరిన శ్రీమహావిష్ణువు దేవేరి శ్రీమహాలక్ష్మీదేవిని ఆషాఢ శుద్ధ చతుర్దశి సందర్భంగా ఆదివారం రకరకాల గాజులతో అలంకరించారు. శ్రీమహావిష్ణువును సుగంధభరిత పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించి, పూజించారు. అమ్మవారికి వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, గంగాధరభట్ల గంగబాబు, ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, వేంకటేశ్వర్లు, అర్చకులు సు.దీర్, రామ్‌కుమార్, దత్తాత్రేయశర్మ పూజలు చేశారు. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా శ్రీమహాలక్ష్మీదేవిని, రత్నగిరి దుర్గామాతలు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను, నేరేళ్లమ్మను శాకంబరిగా అలంకరించనున్నారు.

ఈసెట్‌లో ఇద్దరు విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఆదివారం విడుదలైన ఈసెట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి అత్యుత్తమ ర్యాంకులను సాధించారు. ఆలమూరుకు చెందిన వెంపల లక్ష్మీ వీర శివచరణ్ ఇంజినీరింగ్ విభాగంలో ఎనిమిదో ర్యాంకు సాధించి సత్తా చాటాడు. అతను సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్‌లో డిప్లమా పూర్తి చేశాడు. శివచరణ్ తండ్రి సత్యనారాయణమూర్తి టైలర్ కాగా తల్లి నాగమణి గృహిణి. మూలస్థాన అగ్రహారం గ్రామానికి చెందిన గానుగుల నాగ దుర్గ ఫణిశ్రీ కూడా ఎనిమిది ర్యాంకు సాధించింది. ఆమె అనకాపల్లిలోని పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఇంజినీరింగ్ రీజనల్ రీసెర్చ్ స్టేషన్ కళాశాలలో ఇంజినీరింగ్ చదివింది. తండ్రి లక్ష్మణరావు వ్యవసాయదారుడు కాగా తల్లి కుమారి గృహిణి. ఇద్దరు విద్యార్థులకు ఆయా విభాగాల్లో ఎనిమిదవ ర్యాంకు సాధించడం విశేషం.

ఈసెట్‌లో శ్రీకాంత్‌కు 22వ ర్యాంకు



అయినవిల్లి: మండలంలోని ఎంటీఎం డిప్లమా అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న కొల్లి శ్రీకాంత్ ఈ సెట్‌లో 22వ ర్యాంక్ సాధించాడు. శ్రీకాంత్ తల్లిదండ్రులు రామారావు, లక్ష్మిలది అనకాపల్లి. వీరు వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు. శ్రీకాంత్ మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన ఒరవడితో యంత్రాల ద్వారా కూలీల కొరత అధిగమించడానికి కృషి చేస్తానని తెలిపారు. అగ్రికల్చర్‌బీటెక్ చేస్తానన్నాడు. శ్రీకాంత్‌ను కళాశాల యాజమాన్యం అభినందించింది.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని ఉంది



దేశంలోని ప్రతిష్టాత్మకమైన కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని ఉంది. భవిష్యత్‌లో మరికొంత మంది ఇంజనీర్లకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను.

– వెంపల లక్ష్మీ వీరశివచరణ్, ఆలమూరు

సైంటిస్ట్‌ను అవుతాను



వ్యవసాయ విభాగంలో రైతులకు మేలు చేసే విధంగా సైంటిస్టును అవుతాను. వ్యవసాయ రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు నా వంతు కృషి చేస్తాను.

– గానుల నాగదుర్గ ఫణిశ్రీ, మూలస్థాన అగ్రహారం



వానమ్మా.. వాటీజ్ దిస్సమ్మా..

మృగశిర వెళ్లిపోయింది... ఆషాఢం వచ్చింది. కానీ వర్షం జాడ కానరావడం లేదు. మృగశిర కార్తె పేరు చెప్పి గత జూన్ నెలలో ఒకటి రెండు రోజులు ఒక మోస్తరు వర్షం పడిందే కాని... చెప్పుకునేంత భారీ వర్షం పడలేదు. వర్షం జాడ లేక మండుతున్న ఎండలతో సామాన్యులు ఆపసోపాలు పడుతుంటే... ఖరీఫ్ సాగు ముందుకు వెళ్లక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడప్పుడూ కమ్ముకుంటున్న మబ్బులను చూసి 'మేఘమా.. వర్షించుమా' అని సామాన్యులు.. రైతులు కోరుకుంటున్నా వర్షం జాడ మాత్రం కనిపించడం లేదు.

– సాక్షి అమలాపురం

పాడి రైతులకు బీమానందం

- వైఎస్సార్ పశు నష్టపరిహారం పథకం ద్వారా రూ.89 లక్షలు మంజూరు
- త్వరలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ



వైఎస్సార్ పశునష్ట పరిహారం బీమా బిల్లులు ప్రీ ఆడిట్ చేస్తున్న టీమ్ సభ్యులు

రాయవరం: వైఎస్సార్ పశునష్ట, జీవనష్ట పరిహారం పథకం కింద రావాల్సిన సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో పాడి రైతులకు ×బీమా॰నందం కలగనుంది. మూడేళ్లుగా పాడి రైతులకు రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం ×వైఎస్సార్ పశునష్ట పరిహార పథకం॰ అమలు చేస్తోంది. సంకరజాతి పశువు లేదా గేదెకు రూ.30 వేలు, దేశీయ జాతికి రూ.వేలు, మేకలు, గొర్రెలకు రూ.6వేలు వంతున పరిహారం వర్తింపజేశారు. వైఎస్సార్ పశునష్ట పథకం స్థానంలో ప్రభుత్వం ఇప్పుడు ×వైఎస్సార్ పశు బీమా॰ పథకం అమల్లోకి తీసుకువచ్చింది.

రూ.89 లక్షలు విడుదల

వైఎస్సార్ పశునష్ట పరిహారం మంజూరుపై అపోహలను తొలగిస్తూ..పాడి రైతులకు లబ్ధి కలిగేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది వివిధ కారణాలతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా 310 పశువులు మృతి చెందగా రూ.89 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది. ఇదిలా ఉంటే 2020-21, 2021-22 సంవత్సరాలకు సంబంధించిన వైఎస్సార్ పశునష్ట పథకంలో జిల్లాకు సంబంధించి 100 మంది లబ్ధిదారులకు బీమా సొమ్మును చెల్లించనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బడ్జెట్‌లో 100 మంది లబ్ధిదారుల సొమ్ము భాగమై ఉంది. లబ్ధిదారులైన పాడి రైతులకు పశునష్ట పరిహారం చెల్లించేందుకు జిల్లా స్థాయిలో మూడు కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు వైఎస్సార్ పశునష్టపరిహార పథకం జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎస్.రేవంత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రీ ఆడిట్ చేసే పనిలో నిమగ్నమయ్యాయి. ఆ శాఖ ఏడీలు, డాక్టర్లు, సిబ్బంది కలిసి ట్రెజరీ/ సీఎఫ్‌ఎంఎస్‌కు బిల్లులు తయారు చేయడంలో నిమగ్నమయ్యారు. అతి త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో బీమా సొమ్ము నేరుగా జమ కానుంది.

కమిటీలు ఏర్పాటు చేశారిలా..

కమిటీ	సభ్యులు
టీమ్-ఎ	డాక్టర్ ఒ.రామకృష్ణ, ఏడీ, రామచంద్రపురం డాక్టర్ డి.వినోద్‌కుమార్, వీఏఎస్, జొన్నాడ. బి.సాగర్, డీఈవో, ఏవీహెచ్, ఆలమూరు.
టీమ్-బి	డాక్టర్ ఎల్.విజయారెడ్డి, ఏడీ, ఏవీహెచ్, అమలాపురం. డాక్టర్ ఎం.సాయిభాస్కర్, వీఏఎస్, రావులపాలెం. వి.శ్రీనివాసరావు, డీఈవో, ఏవీహెచ్, రావులపాలెం.
టీమ్-సి	డాక్టర్ కె.రవికుమార్, ఏడీ, ఏవీహెచ్, రాజోలు కె.వెంకటరత్నం, డీఈవో, ఏవీహెచ్, ముమ్మిడివరం.

అర్హులైన లబ్ధిదారులందరికీ..



వైఎస్సార్ పశునష్ట పరిహారం పథకం కింద బీమా సొమ్ము మంజూరైంది. కలెక్టర్ హిమాన్షు శుక్లా నేతృత్వంలో అర్హులైన లబ్ధిదారులందరికీ బీమా సొమ్మును నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తాం. ప్రస్తుతం అప్పటి బిల్లులకు సంబంధించి ప్రీ ఆడిట్ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ కర్నీడి మూర్తి, జాయింట్ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, అమలాపురం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి




పువ్వల సింహాద్రి (ఫైల్) గురజా సూరిబాబు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేటలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హసన్‌బాద గ్రామానికి చెందిన పువ్వల సింహాద్రి(23) ద్రాక్షారామలో మందులు కొనుక్కుని స్వగ్రామం హసన్‌బాదకు మోటారు సైకిల్‌పై బయలుదేరారు. తోటపేట గాంధీనగర్‌కు చెందిన గురజా సూరిబాబు(25) కాటే సింహాచలంతో కలసి కాకినాడ వైపు నుంచి ద్రాక్షారామకు మోటారు సైకిల్‌పై వస్తున్నారు. తోటపేట వంకాయల తూము వద్దకు వచ్చేసరికి వీరి మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పువ్వల సింహాద్రి, గురజా సూరిబాబు ఇద్దరికీ తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాటే సింహాచలంకు కాలు విరిగిపోయింది. ముగ్గురినీ రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 2.30 గంటలకు పువ్వల సింహాద్రి మృతి చెందాడు. గురజా సూరిబాబును మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందాడు. మరణించిన సింహాద్రికి వివాహం జరిగింది. భార్య గర్భవతిగా ఉంది. సూరిబాబుకు ఇంకా వివాహం కాలేదు. ఇద్దరు యువకుల మృతితో హసన్‌బాద, తోటపేటల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

యువకుడి దుర్మరణం

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి హైవేపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కొవ్వూరు గ్రామానికి చెందిన సత్యంశెట్టి నాగఫణింద్ర(26)మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసుల వివరాల ప్రకారం మోటారు సైకిల్‌పై తూరంగి పగడాలపేట నుంచి హైవే మీదుగా కొవ్వూరు స్వగ్రామం వెళ్లేందుకు నాగఫణింద్ర, కేతనకుట్టి సురేష్ వస్తూ రోడ్డుకు అడ్డంగా ఉంచిన బారికేడ్‌లు, సిమెంట్ దిమ్మలను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్ నడుపుతున్న నాగఫణీంద్రకు తలకు బలమైన గాయమవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక కూర్చున్న సురేష్‌కు కాలు విరిగిపోయింది. మృతుడికి భార్య, పాప ఉన్నారు. నాగఫణీంద్ర కొవ్వూరులో కిరాణా సరకులు అమ్ముకుని జీవనోపాధి పొందేవాడు. మృతదేహానికి ఆదివారం జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గాయపడిన సురేష్ స్టేట్‌మెంట్‌తో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగరాజు తెలిపారు.

అదిరేట్టు.. ఐదారు రెట్లు!

- ఆర్టీసీ ఉద్యోగులకు అధిక పెన్షన్ స్కీమ్
- ప్రభుత్వం అ'విశ్రాంత' కానుక
- 'తూర్పు'న 1,158 మందికి లబ్ధి
- నమోదుకు 11 తుది గడువు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఉద్యోగుల భద్రతే పరమావధిగా పని చేస్తోంది. ఇందులో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చింది. వారి జీవితాల్లో వెలుగులు తెచ్చింది. ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి ఉద్యోగ విరమణ పొందిన వారి సంక్షేమానికి మరో సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకూ ఈ సంస్థలో పని చేసిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం అరకొరగా పెన్షన్ అందేది. ఆ విధానానికి చరమగీతం పాడి అధిక పెన్షన్ స్కీమ్ (హయ్యర్ పెన్షన్)కు ప్రభుత్వం నూతన ప్రణాళిక సిద్ధం చేసింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగి పదవీ విరమణ అనంతరం అధిక మొత్తంలో పెన్షన్‌ను జీవితాంతం అందుకునేందుకు బాట పడింది. వీరు ఉద్యోగ విరమణ అనంతరం కనీసం రూ.మూడు వేల పెన్షన్ మాత్రమే పొందేవారు. ఈ హయ్యర్ పెన్షన్ స్కీమ్ ద్వారా ఇప్పటి వరకూ అందే పెన్షన్ కన్నా 5 నుంచి 6 రెట్ల వరకూ పెరిగే అవకాశం ఉంది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల చిరకాల స్వప్నం నెరవేరనుంది. ఈ స్కీమ్‌లో నమోదు అయ్యేందుకు ఆన్‌లైన్‌లోనే ఎంప్లాయీస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో వివరాలు అప్‌లోడ్ చేసే విధంగా చర్యలు చేపట్టింది. దీనికి 2014 సెప్టెంబర్ 1 నాటికి ఆర్టీసీ ఉద్యోగిగా విధుల్లో చేరిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ మెకానిక్‌లు, సెక్యూరిటీ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది అర్హులు.



ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సిన వెబ్‌సైట్

జిల్లాలో లబ్ధిదారులు ఇలా..

డీపీటీఓ కార్యాలయ ఉద్యోగులు	29
రాజమహేంద్రవరం డిపో	488
కొవ్వూరు డిపో	232
గోకవరం డిపో	264
నిడదవోలు డిపో	145
మొత్తం ఉద్యోగులు	1,158

మరో అవకాశం ఇచ్చి..

ఈ పథకంలో నమోదుకు మొదటి విడత ఏప్రిల్ 3 నుంచి మే 3 వరకూ, రెండో విడత మే 4వ తేదీ నుంచి జూన్ 26 వరకూ అవకాశం కల్పించింది. అయితే కొద్దిమంది ఉద్యోగులు సాంకేతిక లోపం కారణంగా సరైన వివరాలు నమోదు చేయకపోవడం, మరికొంత మంది దరఖాస్తులు తిరస్కరణకు గురవడంతో మరో అవకాశం ఇచ్చింది. మూడో విడతగా జూన్ 27 నుంచి జూలై 11వ తేదీ గడువు ఇస్తూ నమోదు చేసుకోవాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు పూర్తి స్థాయిలో నమోదు చేసుకున్నాక వారి బేసిక్ స్కేల్‌ను అనుసరించి ఎంప్లాయీస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్ లెక్కలు కట్టి ఉద్యోగులకు చెల్లించే మొత్తాన్ని ప్రకటించనుంది.

ఆ ఘనత సీఎం జగన్‌దే..



ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిదే. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత అరకొర పింఛన్ వస్తుందని ఆందోళన చెందాం. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం జగన్ అధిక పెన్షన్ పథకం తీసుకు రావడం సంతోషంగా ఉంది. నమోదు అనంతరం ప్రావిడెంట్ ఫండ్ సంస్థకు చెల్లించాల్సిన మొత్తం ఒకేసారి కాకుండా వాయిదాల పద్ధతిలో కట్టుకునే అవకాశం కల్పిస్తే వెసులుబాటుగా ఉంటుంది. దీనిపైనా ప్రభుత్వం పెద్ద మనసుతో ఆలోచించాలి. – గిడ్ల చిరంజీవి, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నేత

ఇదో అద్భుత అవకాశం



ఆర్టీసీ ఉద్యోగులకు ఇదో అద్భుత పథకం. జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో 1,158 మంది ఉద్యోగులు ఈ పథకంలో నమోదు చేసుకునే అవగాహన కల్పించాం. దీనిని వారు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాం. సాంకేతిక కారణాలతో వెనుతిరిగి వచ్చిన 49 మంది ఉద్యోగుల దరఖాస్తులను తిరిగి నమోదు చేస్తున్నాం. రెండు రోజుల్లో నమోదు ప్రక్రియ పూర్తి చేయిస్తాం.

–షర్మిలఅశోక, డీపీటీఓ, రాజమహేంద్రవరం

ఏపీ ఈసెట్-2023 ఫలితాలు విడుదల

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు పాలిటెక్నిక్, బీఎస్సీ (గణితం) ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నిర్వహించిన ఏపీ ఈసెట్-23 ఫలితాలు ఆదివారం విడుదల చేశారు. ఫలితాలు జేఎన్‌టీయూకేలో ఉన్నత విద్యామండలి చైర్మన్ కే.హేమచంద్రారెడ్డి విడుదల చేశారు. కాకినాడ జిల్లాలో బాలురు 1,122 మందికిగాను 1,054 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 432కు గాను 416 మంది ఉత్తీర్ణత సాధించారు. కోనసీమ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలో బాలుర విభాగంలో 485కుగాను 442 మంది ఉత్తీర్ణులు కాగా బాలికల విభాగంలో 143కు 137 మంది విజయం సాధించారు. తూర్పు గోదావరి జిల్లాలో బాలుర విభాగంలో 1,048కుగాను 959 మంది ఉత్తీర్ణులు కాగా బాలికల విభాగంలో 325 అభ్యర్థులకు 308 మంది ఉత్తీర్ణత సాధించారు. సిరామిక్ టెక్నాలజీలో సామర్లకోటకు చెందిన పవన్ సత్య మణికంఠ కుమార్ రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంక్, సీఎస్ఈలో మండపేటకు చెందిన కే.రామ్‌తేజ 5వ ర్యాంక్, ఫార్మసీలో కాకినాడకు చెందిన టి.హారిక 2వ ర్యాంక్ సాధించారు. ఫలితాలు విడుదలలో సెట్ చైర్మన్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, కన్వీనర్ కృష్ణమోహన్ కో-కన్వీనర్ వెంకటరెడ్డి, పద్మ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

చదరంగంలో చిచ్చర పిడుగు

రాష్ట్రస్థాయి అవార్డు పొందిన వి.సావరం విద్యార్థి



రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థాయి అవార్డు తీసుకుంటున్న వెంకటశివరామ్

రాయవరం: మండలంలోని వి.సావరం గ్రామానికి చెందిన గుత్తుల వెంకటశివరామ్ చదరంగంలో అద్భుతమైన ప్రతిభ కనబర్చాడు. స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న వెంకట శివరామ్ విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో ఏడు సంవత్సరాల వయసు విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. సెప్టెంబర్ 20న పశ్చిమబెంగాల్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున వెంకటశివరామ్ పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాకల విశ్వేశ్వరరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. వెంకటశివరామ్ తండ్రి సురేష్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కాగా తల్లి స్వాతి గాయత్రి గృహిణి. వెంకటశివరామ్ చిన్న వయస్సులోనే చదరంగంలో అద్భుతమైన ప్రతిభ కనబర్చడం పట్ల సర్పంచ్ కాకి కృష్ణవేణి, ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, ఎంఈవోలు కె.వివేకానంద, వై.సూర్యనారాయణ అభినందించారు.

హోం గార్డు నిజాయితీ

- రూ.70 వేల బంగారు నల్లపూసల దండను జారవిడుచుకున్న భక్తురాలు
- అధికారుల సమక్షంలో తిరిగి అందజేత



బంగారు నల్లపూసల దండ

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి ఆదివారం విచ్చేసిన భక్తురాలు జార విడుచుకున్న రూ.70 వేల విలువ గల 15 గ్రాముల బంగారు నల్లపూసల దండ ఆలయం వద్ద విధులు నిర్వహిస్తున్న హోం గార్డు సూరి కృష్ణకు దొరకగా, దానిని పోగొట్టుకున్న భక్తురాలికి అధికారుల ద్వారా తిరిగి అందజేశారు. వివరాల్లోకి వెడితే...అమలాపురానికి చెందిన హాకీ సుబ్బలక్ష్మి కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరించి స్వామి వారిని దర్శించారు. అనంతరం వారు అమలాపురం వెడుతూ కాకినాడ వద్ద తన మెడలో నల్లపూసలు దండ లేని విషయం గమనించారు. దీంతో వారు మధ్యాహ్నం మళ్లీ అన్నవరం దేవస్థానానికి వచ్చి నల్లపూసలు దండ పోయిన విషయం పీఆర్వో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అయితే అంతకుముందే ఆలయం వద్ద నల్లపూసలు దండ దొరికిందని హోం గార్డు సూరి కృష్ణ దానిని అధికారులకు అందజేశాడు. అధికారులు మైక్‌లో నల్లపూసలు దండ దొరికిన విషయం ప్రకటించి వివరాలు తెలిపి తీసుకువెళ్లాలని కోరారు. కాగా, సుబ్బలక్ష్మీ తన నల్లపూసలు దండ దేవస్థానంలో పడిపోయిందని అధికారులకు ఫిర్యాదు చేశారు. కారులో పడిపోయిందేమోనని అంతా వెదికామని కాని కనిపించలేదని దేవస్థానంలోనే పడిపోయిందని నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. ఆ నల్లపూసల దండ వివరాలు అధికారులకు తెలియచేయడంతో దానిని పీఆర్వో సూపరింటెండెంట్ కాపారపు శివ ఆమెకు అందజేశారు. హోంగార్డు సూరి కృష్ణను భక్తురాలు సుబ్బలక్ష్మి, దేవస్థానం అధికారులు అభినందించారు.



భక్తురాలు సుబ్బలక్ష్మికి దండను అందజేస్తున్న సూపరింటెండెంట్ శివ

సాంకేతిక విద్యకు దిక్సూచి జేఎన్‌టీయూకే

ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రాష్ట్రంలో సాంకేతిక విద్యకు దిక్సూచిగా జేఎన్‌టీయూ కాకినాడ నిలుస్తుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలో ఉన్న యూనివర్సిటీల వీసీలతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు ఐదవ సమావేశం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా చైర్మన్ హేమచంద్రారెడ్డి ఉన్నత విద్యారంగం అభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలని వీసీలకు పిలుపునిస్తూ రెండు రోజుల పాటు జరిగిన సదస్సులో ఎన్నో నూతన ఆవిష్కరణలకు, ఆలోచనలకు స్థానం లభించిందన్నారు. మహారాష్ట్ర నాలెడ్జ్ కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ మెంటార్ వివేక్ సావంత్ మల్టీ డిసిప్లినరీ ఎడ్యుకేషన్ ఫెసిలిటేటింగ్ త్రూ ఇంటర్-ఇనిస్టిట్యూట్ కనెక్ట్ అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మల్టీ డిసిప్లినరీ ఎడ్యుకేషన్ గురించి వివరిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, మార్కెట్లో అభివృద్ధి చెందుతున్న ధోరణులపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు జాబ్ మార్కెట్‌లో అభివృద్ధి చెందుతున్న పోకడలను గ్రహించాల్సిన అవశ్యకత ఉందన్నారు. 2035 నాటికి అధిక సంఖ్యలో మల్టీ డిసిప్లినరీ ఇనిస్టిట్యూట్‌లు ఏర్పాటవుతాయన్నారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బి.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పరిశ్రమలకు అనుగుణంగా బీటెక్ ఇంజినీరింగ్ సైన్స్ కోర్సులు రూపొందించాలని, పరిశ్రమలలో చేసే సాంకేతిక ఉద్యోగుల కోసం ఎంటెక్ ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించేందుకు సాయంకాలం తరగతులు నిర్వహించాలన్నారు. మల్టీ డిసిప్లినరీ ప్రాజెక్టులు చేపట్టేలా దృష్టి సారించాలని కోరారు. అనంతరం సదస్సులో పాల్గొన్న వివిధ వర్సిటీల వీసీలను సత్కరించి, సదస్సు విజయవంతం చేసిన జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజును సత్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ , రిజిస్ట్రార్ సుమలత, డీఈ బాలకృష్ణ, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.



జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ ప్రసాదరాజును సత్కరిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

తేనెటీగలు కుట్టి దింపు కార్మికుడి మృతి

ముమ్మిడివరం: తాడి చెట్టు ఆకులు కొడుతున్న దింపు కార్మికుడిపై తేనెటీగలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధి పొట్టిలంకలో శనివారం సాయంత్రం ఆదే గ్రామానికి చెందిన దింపు కార్మికుడు పోతుల శ్రీనివాసరావు(50)ఒక రైతు పొలంలో తాటాకులు కొడుతుండగా తేనెటీగలు చెలరేగి అతనిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య బేబి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్సై కె.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూర నచ్చలేదని ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తి మృతి

కరప: వండిన కూర నచ్చక భార్యతో గొడవపడి ఆత్మహత్యకు యత్నించిన ఒక వ్యక్తి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. కరప పోలీసుస్టేషన్ రైటర్ శ్రీను తెలిపిన కథనం మేరకు....

కరప మండలం గొర్రిపూడికి గ్రామానికి చెందిన రచ్చ ఆదినారాయణ(57) గత నెల 26వ తేదీన రాత్రి సమయంలో కూర మంచిగా వండలేదని భార్య బ్రహ్మేశ్వరితో గొడవ పడి, ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. భార్యపై కోపంతో పశువులపాక వద్ద చీమలమందు తాగాడు. 27వ తేదీ ఉదయం ఇంటికి వచ్చి చీమలమందు తాగినట్టు చెప్పి, కిందకు పడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో శనివారం రాత్రి మృతిచెందాడు. భార్య బ్రహ్మేశ్వరి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఏఎస్ఐ వి.సూరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా పునః ప్రారంభమైన జోస్‌ఆలుక్కాస్



రిబ్బన్ కత్తిరించి షోరూంను పునః ప్రారంభిస్తున్న హోం మంత్రి వనిత

ప్రకాశం నగర్ : ప్రముఖ బంగారు అభరణాల షోరూం జోస్‌ఆలుక్కాస్ ఆదివారం స్థానిక డీలక్స్ సెంటర్‌లో ఘనంగా పునః ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి హోంమంత్రి తానేటి వనిత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రిబ్బన్ కత్తిరించి షోరూంను పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ఖాతాదారులకు నాణ్యమైన బంగారు నగలను అందించాలని కోరారు. సంస్థ ఎండీ పాల్ ఆలుక్కా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఇప్పటికే 50 షోరూంలు ఉన్నాయని, భవిష్యత్తులో 100 షోరూంలను ఏర్పాటు చేసే ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. పునః ప్రారంభం సందర్భంగా ఖాతాదారులకు రూ.50 వేల కొనుగోలుపై ఒక గోల్డ్ కాయిన్ ఉచితంగా అందిస్తున్నామని, వజ్రాల కొనుగోలుపై 20 శాతం డిస్కౌంట్ అందిస్తున్నామని తెలిపారు. పాత 916 ఆభరణాలను కొత్త హాల్ మార్క్ ఆభరణాలుగా మార్చుకునే సదుపాయం కల్పిస్తున్నామని, ప్లాటినం ఆభరణాలపై 7శాతం డిస్కౌంట్ అందిస్తున్నామని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎం లీనో జాన్, మేనేజర్ జియో పాల్గొన్నారు.

జాతరలా తాతగారి పుట్టినరోజు



కుటుంబ సభ్యుల నడుమ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న శతాధిక వృద్ధుడు సత్యం

- 103వ జన్మదిన వేడుక జరుపుకున్న సత్యం
- తరలివచ్చిన మనువలు, మునిమనువలు

మండపేట: శతాధిక వృద్ధుని జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. విందు వినోదాలతో కుటుంబ సభ్యులు అందరూ కలసి సందడిగా వేడుకను జరిపించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఇతర ప్రముఖులు హాజరై తాతగారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం మండలంలోని కేశవరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ వేడుక వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పసుపులేటి సత్యం 103వ పుట్టిన రోజును పురస్కరించుకుని అతని చిన్న కుమారుడు వెంకన్న ఆధ్వర్యంలో గ్రామంలో వేడుకలు నిర్వహించారు. సత్యంనకు నలుగురు కుమారులు కాగా అందరూ వ్యవసాయం చేస్తారు. వారి పిల్లలు,ముని మనువలు 70 మంది వరకు ఉన్నారు. 103 ఏళ్ల వయసు వచ్చినా ఇప్పటికీ తన పనులు తానే చేసుకుంటారని, నాటి సంగతులు ఆసక్తిగా చెబుతుంటారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్కెస్ట్రా, విందు భోజనాలతో పుట్టిన రోజు వేడుక నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట ముఖ్య అతిథిగా హాజరై సత్యంతో కేక్ కట్ చేయించి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. కుటుంబ సభ్యులతో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, గ్రామ ప్రముఖులు పెదపాటి ఉమామహేశ్వరరావు, కొప్పిరెడ్డి ప్రసాద్, తుపాకుల ప్రసన్నకుమార్, అబ్బిరెడ్డి వీర్రాజు పాల్గొన్నారు.



శతాధిక వృద్ధుడు సత్యంకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్సీ తోట

ఈ విజయం ఉద్యోగులకు అంకితం

ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు

కాకినాడ సిటీ: ఏపీ జేఏసీ అమరావతి ప్రకటించిన ఉద్యమాన్ని 92 రోజుల పాటు కష్టించి పని చేసి కార్యాచరణను అమలు చేసి విజయవంతం చేయడంతో ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించిందని, ఈ ఉద్యమంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి రాష్ట్ర కమిటీ ధన్యవాదాలు తెలుపుతుందని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కాకినాడలోని రెవెన్యూ భవన్‌లో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల ప్రతినిధులతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీ జేఏసీ అధ్యక్షుడు పితాని త్రినాధరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 92 రోజుల పాటు ఉద్యోగులంతా చేసిన ఉద్యమానికి ఎలాంటి ఫలితాలు వచ్చాయనే వాటిపై సమావేశంలో ప్రతినిధులకు బొప్పరాజు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో సుదీర్ఘంగా జరిపిన చర్చల్లో 47 అంశాలను ప్రస్తావించగా రాష్ట్ర స్థాయి అధికారులు చర్చించి 37 అంశాలను పరిష్కరించారన్నారు. ఈ విజయాన్ని ఉద్యోగులకు అంకితం చేస్తున్నామని జేఏసీ నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు, టీవీ ఫణిపేర్రాజు ప్రకటించారు. ఏపీ జేఏసీ అమరావతి కోరిక మేరకు ఇప్పటికే అత్యధిక శాఖాధిపతులు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి నెలా జిల్లా కలెక్టర్లు కూడా ఇదే విధంగా ప్రత్యేక గ్రీవెన్స్ డేలు నిర్వహించాలని కోరుతున్నామన్నారు. గత నెలలో ఉద్యోగుల సమస్యలపై 23, 27, 30 తేదీల్లో గ్రీవెన్స్ డేలు నిర్వహించారని, ఈ నెల 3వతేదీన గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లు స్థాయిలో ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి గ్రీవెన్స్ డే నిర్వహించాలని జీవో విడుదల చేయడం చారిత్రాత్మకమన్నారు. దీంతో ఎప్పటికప్పుడు ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాధరావు ఆధ్వర్యంలో రాష్ట్ర జేఏసీ నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, దామోదరరావు, టీవీ ఫణిపేర్రాజు తదితరులను గజమాలలతో సత్కరించారు. రాష్ట్ర జేఏసీ ప్రతినిధులందరూ ఉద్యమంలో పాల్గొన్న వివిధ జిల్లాల ప్రతినిధులు పితాని త్రినాథరావు, ఎన్‌పీఎస్ఎస్‌ఆర్‌కే దుర్గాప్రసాద్, టీవీ సతీష్, వైవీ రావు, డి. శ్రీనివాస్, వై.శ్రీనివాసరావు, కె.రమేష్‌కుమార్, బి.రాంబాబు, ఎస్.శివశంకర్, డి.శ్రీనివాస్, ఎంకే ప్రసాదరావు ఏఆర్ శివకుమార్, సూరిబాబు, పి.జార్జిబాబులను దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు, రాష్ట్ర 4 క్లాస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు, బగ్గా జగదీష్, బి.కిశోర్‌కుమార్, జి.జ్యోతి, ఎ.సాంబశివరావు పాల్గొన్నారు.



అభినందన సభలో మాట్లాడుతున్న రాష్ట్ర జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు